


PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక: 45 ఎడిటర్: రాపోలు లింగస్వామి 15 -10 -2026 గురువారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00

## కరెంటు ఉత్పత్తిని ఎందుకు పెంచటం లేదు?

**కరెంటు కోతలపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు సీఎం తీవ్ర హెచ్చరిక**
**పంటలను కాపాడేందుకు విద్యుత్ సరఫరాను మెరుగుపరచాలని ఎన్నిసార్లు చెప్పాలి?**
**కోతలకు రోజుకో కారణం చెప్పొద్దు**
**వచ్చే 20 రోజులు పంటలకు కీలకం**
**ఎట్టి పరిస్థితుల్లోనూ కరెంటు ఆపొద్దు**
**ఎల్‌నినో ప్రభావంపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష**

హైదరాబాద్, అక్టోబరు 14: రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న విద్యుత్ అంతరాయాలపై ఆ శాఖ ఉన్నతాధికారుల మీద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా సాఫీగా జరిగేలా చూడాలని తాను పలుమార్లు ఆదేశించినా పరిస్థితిలో మార్పు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. 'ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సింది నేను. రైతుల పంటలను కాపాడేందుకు తగిన విధంగా విద్యుత్ సరఫరా చేయాలని ఎన్నిసార్లు చెప్పినా పరిస్థితి మారటం లేదు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలను సహించేది లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎవరినీ ఉపేక్షించను. అవసరమైతే విద్యుత్ శాఖ స్పెషల్ సీఎస్, జెన్‌కో సీఎండీ.. సంబంధిత విభాగపు ఐఏఎస్ లను, ఉన్నతాధికారులను సస్పెండ్ చేస్తా' అంటూ సీఎం తీవ్రస్థాయిలో హెచ్చరించినట్లు సమాచారం. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, విద్యుత్, తాగునీటి సరఫరాపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలవారీగా ప్రస్తుత పరిస్థితులను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా విద్యుత్ అంతరాయాలపై సీఎం స్పందిస్తూ.. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉ



న్నప్పటికీ ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు లింకేజీ ఏర్పాట్లు చేసినా యాదాద్రి విద్యుత్ ప్లాంట్‌లో పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి ఎందుకు జరగడం లేదన్నారు. ఈ క్రమంలోనే, తాను ఇప్పటికే పలుమార్లు ఆదేశాలు జారీ చేసినా పరిస్థితులు మారకపోవటంపై అధికారుల మీద విరుచుకుపడ్డారు. విద్యుత్ అంతరాయాలకు రోజుకో కారణం చెప్పవద్దని హెచ్చరించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు ఎండిపోకుండా రేయింబవళ్లు విద్యుత్ సరఫరా చేయాలని, పంటలు చేతికొచ్చే వరకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. వచ్చే 20 రోజులు పంటలకు అత్యంత కీలకమని, ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ కొరత కారణంగా రైతులు పంట నష్టపోకూడదని తెలిపారు. వ్యవసాయానికి విద్యుత్ అవసరం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అందుకు అనుగుణంగా సరఫరా పెంచాలన్నారు. ఎల్‌నినో కూడా కరోనా లాంటి విపత్తేనని, ఈ పరిస్థితి ఎప్పటివరకు ఉంటుందో ఎవరికీ తెలియదని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అప్రమత్తం కాకపోతే సంక్షోభం తలెత్తుతుందని హెచ్చరించారు. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో ఎల్‌నినో ప్రభావాన్ని లోతుగా అంచనా వేసి, సమస్యలను అధిగమించేందుకు పరిష్కార మార్గాలను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. మళ్లీ వానలు పడే వరకూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టాల్సిందేనని స్పష్టం చేశారు. వచ్చే జూన్ వరకు అవసరమైన యాక్షన్‌ప్లాన్‌ను ప్రతి శాఖ రూపొందించాలని ఆదేశించారు. 2వ పేజీలో ..

## విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న రాష్ట్రపతి ముర్ము



విజయవాడ: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అంతరాలయంలో పూజల అనంతరం అర్చకులు రాష్ట్రపతికి వేదాశీర్వచనం ఇచ్చారు. ఆలయ అధికారులు పట్టువస్త్రాలు, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. ఇంద్రకీలాద్రికి చేరుకున్న రాష్ట్రపతికి హోంమంత్రి అనిత, ఎంపి కేశినేని చిన్ని, ఛైర్మన్ రాధాకృష్ణ, ఇవో శీనా నాయక్ స్వాగతం పలికారు. క్యూలైన్లలోని భక్తులకు నమస్కారం చేస్తూ రాష్ట్రపతి ముందుకు సాగారు. అంతకు ముందు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి రాష్ట్రపతి ముర్ము చేరుకున్నారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కమలేశ్ పాశ్వాన్, పెమ్మసాని చంద్రశుఖర్, రాష్ట్ర మంత్రలు లోకేశ్, అనిత, కొల్లు రవీంద్ర, ఎంపి వల్లభనేని బాలశౌరి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో విజయవాడకు చేరుకున్నారు.

## కాప్రా చెరువు అవుట్‌లెట్ పనులకు మరో రూ.7 కోట్ల ప్రతిపాదనలు

**వచ్చే వర్షాకాలంలోపు పనులు పూర్తి చేయాలి**
**: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి**



ఎల్ బీ నగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, అక్టోబర్ 14:బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని హరిహరపురం కాలనీలో ఉన్న కాప్రా చెరువు అవుట్‌లెట్ నిర్మాణ పనులను వేగవంతం చేసి, వచ్చే వర్షాకాలంలోపు పూర్తి చేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులను కోరారు. ఈ మేరకు జోనల్ కమిషనర్ వికాస్ మహాతోతో కలిసి ఎమ్మెల్యే కాప్రా చెరువు పరిసర ప్రాంతాల్లో పర్యటించి, పనుల పురోగతిని పరిశీలించారు.కాప్రా చెరువు అవుట్‌లెట్ పనుల కోసం గతంలో రూ.5 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ప్రస్తుతం కుమ్మరికుంట నుంచి మిలీనియం కాలనీ వరకు పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. మిలీనియం కాలనీ నుంచి కాప్రా చెరువు వరకు మిగిలిన పనులకు మరో రూ.7 కోట్ల అంచనా వ్యయంతో నిధుల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఈ నిధులను త్వరితగతిన మంజూరు చేసి పనులు చేపట్టాలని జోనల్ కమిషనర్‌ను కోరారు.కాప్రా చెరువు అవుట్‌లెట్ నిర్మాణ పనులు పూర్తయితే దిగువ ప్రాంతాల్లోని శాతవాహన నగర్, సాయి గార్డెన్, గాంధీనగర్, గాంధీనగర్ సౌత్, స్నేహమయి నగర్, అఖిలాండేశ్వరి నగర్, పీవీఆర్ కాలనీ, సామానగర్ తదితర కాలనీలకు వరద ముంపు సమస్య నుంచి ఉపశమనం లభిస్తుందని ఎమ్మెల్యే వివరించారు. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ వికాస్ మహాతో మాట్లాడుతూ అదనపు నిధుల కోసం ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామని, త్వరలోనే నిధుల మంజూరుతో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ పర్యటనలో బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, అనిల్ చౌదరి, రాఘవేంద్రరావు, పోగుల రాంబాబు, సందీప్‌తో పాటు పలు కాలనీల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ లలో దేశవ్యాప్తంగా బీసీలకు తీరని ద్రోహం

**బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు వ్యాఖ్య**

హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 14:స్వాతంత్రం వచ్చి 8 దశాబ్దాలు కావస్తున్నా నేటికీ రాజకీయ రిజర్వేషన్లలో బీసీలకు తీరని ద్రోహం చేస్తున్నారని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు బుధవారం హైదరాబాదులోని హిమాయత్ నగర్ లో గల బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయంలో బీసీ ముఖ్య నాయకులతో కలసి పాత్రికేయులతో మాట్లాడుతూ.... కనీసం స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కావాలని పెద్ద ఎత్తున తెలంగాణలో ఉద్యమిస్తే దిగివచ్చిన రాష్ట్ర ప్రభుత్వం 42% రిజర్వేషన్ కొరకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తే అక్కడ అధికారంలో ఉన్న బిజెపి ఆ బిల్లు ఆమోదం పొందకుండా పెండింగ్లో పెట్టిందని సుమారు 20 నెలలకు పైగా ఆ బిల్లు అలాగే ఉన్నదని ఇక్కడ బిజెపి వారు మాత్రం బీసీ రిజర్వేషన్లకు బిజెపి కట్టుబడి ఉన్నదని, బొంకుతున్నారని పైగా ప్రధాని బీసీ అభ్యర్థి అని అబద్ధాలు వల్లే వేస్తున్నారని బీసీ ఉద్యోగులకు క్రిమిలేయర్ పెట్టి ఉద్యోగ అవకాశాలను ప్రభుత్వం దెబ్బతీస్తున్నదని ఆయన విమర్శించారు బీసీలకు న్యాయం జరగాలంటే కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దిగిపోవాలని అందుకు ఈవీఎం పద్ధతి ద్వారా కాకుండా బ్యాలెట్ పద్ధతిలో ఎన్నిక నిర్వహిస్తే బిజెపి అడ్రస్సు గల్లంతవుతుందని ఆ దిశగా బీసీ ఎస్సీ ఎస్టీ



మైనార్టీ వర్గాలు పెద్ద ఎత్తున ఉద్యమించాలని, ఇప్పటికే వ్యవసాయాన్ని ధ్వంసం చేసేందుకు మూడు నల్ల చట్టాలు తెచ్చి ప్రజాగ్రహానికి గురై వెనక్కు తీసుకున్నారని ఇటీవల నీటు పరీక్ష విధానంలో జరిగిన అవకతవకల వల్ల కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశాడని ఇప్పుడు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కొరకు దేశవ్యాప్తంగా ఉద్యమాలు నడుస్తున్నాయని ఇక మిగిలింది మోడీ షా ద్వయం మాత్రమే బీసీలు చూసుకుంటారని ఆయన అన్నారు. ఆయన వెంట బీసీ హక్కుల సాధన సమితి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు అంబటి బాపురాజు ప్రధాన కార్యదర్శి గాలి కృష్ణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ప్రమీల జే లక్ష్మి మనోచారి ఉన్నారు

## ఘనంగా బతుకమ్మ పాట ఆవిష్కరణ

**నిర్మాణ బృందానికి కవిత అభినందనలు**



జ్యోతి ప్రభంజనం, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14:× తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతిబింబించేలా రూపొందించిన బతుకమ్మ పాటను తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బుధవారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని టీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎర్ర సంపత్, బుల్లెట్ బండి లక్ష్మణ్, చిట్టినేని వేణురావు సంయుక్తంగా నిర్మించిన ఈ పాటను ఆమె విడుదల చేశారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు ఎంతో వైభవంగా జరుపుకునే బతుకమ్మ పండుగ విశిష్టతను చాటిచెప్పేలా అందమైన పాటను రూపొందించిన నిర్మాణ బృందాన్ని అభినందించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పాటల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తాంద్ర శ్రీనివాసరావు, బంక రాజ్ కుమార్ యాదవ్, లడ్డు శీను, హీరోయిన్ సిరి యాదవ్, గాయకులు నల్గొండ గద్దర్, ఉష, సంగీత దర్శకుడు కళ్యాణ్, కట్ట సతీష్, అంజి వాయుపుత్ర తదితరులు పాల్గొన్నారు.

## జంతర్‌మంతర్ వద్ద అరెస్ట్‌పై కేటీఆర్ ఆగ్రహం



హైదరాబాద్, అక్టోబర్ 14 ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద త్రివర్ణ పతాకం ప్రదర్శించిన సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను పోలీసులు అదుపులోకి తీసుకొని ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపడంపై బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా నిప్పులు చెరిగారు. దేశ భవిష్యత్తు కోసం నిజాయితీగా పోరాడుతున్న యువత, జెన్-జీ గొంతు నొక్కే ప్రయత్నం అభద్రతా భావానికి నిదర్శనమని మండిపడ్డారు. వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు శాంతియుతంగా గళమెత్తిన యువతపై అతిక్రమణ(ట్రెస్‌పాసింగ్) కేసులు బనాయించడం సమర్థనీయం కాదని కేటీఆర్ పేరొన్నారు. ఇది దేశంలో 'నయా ఎమర్జెన్సీ' తరహా పరిస్థితులను తలపిస్తున్నదని విమర్శించారు. నిరసనలు, ప్రజా ఉద్యమాల ద్వారానే ఈ దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందన్న సత్యాన్ని పాలకులు గుర్తుంచుకోవాలని కేంద్ర ప్రభుత్వ పెద్దలకు కేటీఆర్ హితవు పలికారు.

# సంపాదకీయం

## జ్ఞానేశ్ కుమార్.. రోజురోజుకీ భారం!

హనుమంతుడు తొలుత అశోక వనాన్ని ధ్వంసం చేశాడు. తర్వాత కింకరుల్ని హతమార్చాడు. జంబుమాలీ, మంత్రి కుమారులు, సేనాధిపతులూ కుప్పకూలిపోయారు. రావణుడి కుమారుడు అక్షకుమారుడినీ బండకేసి కొట్టి చంపాడు. చివరకు ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రం ప్రయోగించిన తరువాతే హనుమంతుడి ప్రతాపం తగ్గింది. గత రెండు, మూడు నెలలుగా దేశ రాజధానిలో చోటుచేసుకుంటున్న దృశ్యాలు చూస్తుంటే వాల్మీకి రామాయణం లోని సుందరకాండ ఘట్టాలు గుర్తుకు వస్తున్నాయి.జులై?ఆగస్టు నెలల్లో ప్రధాని మోదీ ప్రభుత్వాన్ని కాక్రోచ్ జనతా పార్టీ ఉక్కిరిబిక్కిరి చేసింది. అనేక ఎన్నికల యుద్ధాల్లో ఆరితేరిన ధర్మేంద్ర ప్రధాన్‌ను కేంద్ర మంత్రిమండలి నుంచి తొలగించడం మోదీకి అనివార్యమయింది. భారత ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ అక్టోబర్ 10న జంతర్ మంతర్ వద్ద మళ్లీ నిరసనకు పూనుకుంటామని సీజేపీ ప్రకటించేసరికి మోదీ సర్కార్ అప్రమత్తమైంది. రెండు రోజుల ముందే సరిహద్దు భద్రతా దళాలు, సాయుధ పోలీసు బలగాలు, కేంద్ర రిజర్వు పోలీసు బలగాలు, పారామిలటరీ దళాలు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ రంగంలోకి దిగాయి. దాదాపు 50వేల మంది భద్రతా సిబ్బందికి తోడుగా ప్రైవేట్ దళాలు కూడా చేరాయని అంచనా. అడుగడుగునా బారికేడ్లు. పోలీసులు లాఠీలు ఝుళిపించారు. రెండు, మూడు రోజుల పాటు న్యూఢిల్లీలో గాలి కూడా పూర్తిగా స్తంభించినట్లు కనపడింది. సీజేపీ నేతలు అభిజీత్ దీప్కే, సౌరవ్‌దాస్, అశుతోష్ రంకాలను విమానంలోనే అరెస్టు చేసి వేర్వేరు ప్రదేశాలకు తరలించారు. ఢిల్లీలోనే దాదాపు 10వేల మందిని అరెస్టు చేశారు. అనేకమంది ఆన్‌లైన్ వ్యాఖ్యాతలు, కార్యకర్తల్ని కస్టడీలోకి తీసుకున్నారు. అన్ని మెట్రో స్టేషన్లనూ మూసివేశారు. ఢిల్లీకి వచ్చే రైళ్లను రద్దు చేశారు. ఇంటర్నెట్‌ను నిలిపివేశారు. అయినప్పటికీ కన్నాట్ ప్లేస్‌లోనూ, జంతర్ మంతర్ వద్దకు చొచ్చుకువచ్చిన యువతీ యువకులనూ నిర్బంధించారు. మీడియానూ వదలలేదు. బస్సుల నుంచి తప్పించుకుపోకుండా, వాటిలోనే ఇనుప చువ్వలతో లాకప్‌లను నిర్మించారు. దేశ రాజధానిలో యువతరంగం ఉవ్వెత్తున ఎగిస్తే ఏమి జరుగుతుందో అని ప్రభుత్వం భయపడినట్టు ఈ చర్యలతో స్పష్టమయింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో కూడా సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ కింద బ్యానర్లు కట్టారు. సుప్రీంకోర్టు ముందున్న లాయర్ల చాంబర్లలోకి ప్రవేశించి న్యాయవాదులను కూడా అరెస్టు చేశారు. సుప్రీంకోర్టు నుంచి మండీహౌస్‌కు ఊరేగింపుగా వెళుతున్న న్యాయవాదులను అరెస్టు చేసి, యమునా కాంప్లెక్స్‌కు తరలించారు. సీనియర్ న్యాయవాది దినేశ్ ద్వివేది వారిలో ఒకరు. ఎన్నికల కమిషన్ తరఫున వాదిస్తున్న రాకేశ్ ద్వివేదీకి ఆయన స్వయానా సోదరుడు. 'అసలు సుప్రీంకోర్టులోనూ, సుప్రీంకోర్టు ముందు నిషేధాజ్ఞలు విధించేందుకు మీ అనుమతి తీసుకున్నారా?' అని సీనియర్ న్యాయవాది గోపాల్‌శంకర్ నారాయణ్ అడిగిన ప్రశ్నకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఎలాంటి సమాధానమూ ఇవ్వలేదు. తనకూ ఈ నిషేధాజ్ఞల గురించి తెలియదని ప్రభుత్వ ప్రధాన న్యాయవాది సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు. న్యాయవాదుల అరెస్ట్‌ను సుప్రీంకోర్టు, హైకోర్టు బార్ అసోసియేషన్లూ, అడ్వకేట్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ ఖండించాయి. చివరకు భారత ప్రధాన న్యాయమూర్తి జోక్యంతో న్యాయవాదులను విడుదల చేశారు. జమ్మూ?కశ్మీర్‌లో ఇంటర్నెట్, టెలీకమ్యూనికేషన్ సదుపాయాలను నిలిపివేయడం రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను కాలరాయడమేనని అనురాధా బాసిన్ కేసులో జస్టిస్ రమణ బెంచ్ 2020లో ఇచ్చిన తీర్పును పలువురు న్యాయవాదులు ఉటంకించడంతో ఢిల్లీలో నిషేధాజ్ఞలు ఎత్తివేయాలని కేంద్రానికి సీజేఐ సూర్యకాంత్ చెప్పాల్సి వచ్చింది. జ్ఞానేశ్ కుమార్ రాజీనామాపై ప్రారంభించిన ఉద్యమం వేడి సుప్రీంకోర్టుకు తగిలినట్లే కనపడుతోంది. ఎందుకంటే ఈ విషయంలో సరైన సమయంలో జోక్యం చేసుకోలేని నిస్సహాయతే సుప్రీంకోర్టును ఆత్మరక్షణలో పడేలా చేసింది.ఈ నేపథ్యంలో అక్టోబర్ 12న ఇండియా కూటమి సుప్రీంకోర్టు వరకు నిరసన ఊరేగింపును నిర్వహించింది. ప్రభుత్వం దాదాపు ప్రేక్షక పాత్ర వహించింది. కాంగ్రెస్ చెబుతున్న ప్రకారం... నిషేధాజ్ఞలు ఉన్నప్పటికీ దాదాపు రెండున్నర లక్షల మంది నాలుగు గంటల పాటు న్యూఢిల్లీలో జరిగిన ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. కాంగ్రెస్, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల కార్యకర్తలే కాకుండా, కాక్రోచ్ పార్టీ పిలుపునకు ప్రతిస్పందించిన విద్యార్థులు, యువజనులు, పౌర సమాజ సభ్యులూ పాల్గొనడంతో కన్నాట్ ప్లేస్ పరిసర ప్రాంతాలు జన సమ్మర్దంతో కిక్కిరిసిపోయాయి. మొట్టమొదటిసారి కాంగ్రెస్ పార్టీ తన బలం యావత్తునూ పూర్తిగా కేంద్రీకరించడంతో వివిధ రాష్ట్రాల నుంచి ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు వేల సంఖ్యలో ఢిల్లీకి చేరుకున్నారు. ఢిల్లీకి రాకపోతే అధిష్ఠానం ఆగ్రహానికి గురికావల్సి వస్తుందన్న భయం మొదటిసారి కాంగ్రెస్ నేతల్లో కనపడింది. సుప్రీంకోర్టుకు ఊరేగింపు ఒక నెపం మాత్రమేనని, మొత్తం పార్టీలో ఉద్యమ స్ఫూర్తిని, వీధి పోరాట తత్వాన్ని రగల్చడమే రాహుల్‌గాంధీ వ్యూహం అన్న విషయం విదితమయింది. పదవులు ఆశిస్తూ, పైరవీలే ధ్యేయంగా జీవిస్తున్న కాంగ్రెస్ నేతలు మొట్టమొదటిసారి చెమటోడ్చారు. పోలీసులతో రాహుల్, ప్రియాంక వాదిస్తూ, వారిని ప్రతిఘటిస్తూ, బారికేడ్లను దాటుతూ ముందుకు సాగుతుంటే కాంగ్రెస్ కార్యకర్తల్లో కదలిక రాకుండా ఎలా ఉంటుంది? ఒక రకంగా ఇది కాంగ్రెస్ నరనరాల్లో చైతన్యాన్ని రగిల్చిన క్షణం.

# కాలం విలువ



కాలానికి మనమిచ్చే విలువ మన విలువను పెంచుతుంది, క్షణాలను గౌరవించే మనిషి చరిత్రలో తన స్థానాన్ని నిలుపుతుంది!కాలం అనేది తిరిగిరాని అమూల్యమైన సంపద,దాన్ని వృథా చేసేవాడికి మిగిలేది పశ్చాత్తాపపు వ్యథ!డబ్బు పోతే మళ్లీ సంపాదించవచ్చు,గడిచిన కాలాన్ని మాత్రం తిరిగి తీసుకురాలేము!ప్రతి క్షణం నీ జీవితానికి ఒక కొత్త అవకాశం,దాన్ని అందిపుచ్చుకోవడమే విజయానికి తొలి నిదర్శనం!కాలాన్ని గౌరవించేవాడికి క్రమశిక్షణ తోడవుతుంది,క్రమశిక్షణతో నడిచేవాడికి గెలుపు దారులు తెరుచుకుంటాయి!ఆలస్యం అలవాటైతే అవకాశాలు దూరమవుతాయి,నిర్లక్ష్యం నిత్యకృత్యమైతే కలలు సమాధి అవుతాయి!సమయాన్ని సద్వినియోగం చేసేవాడు సాధకుడవుతాడు,ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసేవాడు విజేతగా ఎదుగుతాడు!ఇతరుల కాలాన్ని గౌరవించడం సంస్కారం,ఇచ్చిన మాటకు సమయానికి నిలబడటం వ్యక్తిత్వానికి అలంకారం!కాలం ముందు అహంకారానికి చోటు లేదు,కాలాన్ని మించిన గురువు ఈ ప్రపంచంలో మరొకరు లేరు!నిన్నటి కాలం నీకు అనుభవాన్ని మిగిల్చింది,నేటి కాలం నీ చేతిలో బాధ్యతను పెట్టింది!రేపటి భవిష్యత్తు నీ నిర్ణయాల కోసం ఎదురుచూస్తోంది,నీ నేటి శ్రమే రేపటి విజయానికి పునాది వేస్తోంది!కాలాన్ని చులకనగా చూసేవాడు అవకాశాలను కోల్పోతాడు,కాలాన్ని కర్తవ్యంగా భావించేవాడు గమ్యాన్ని చేరుకుంటాడు!హోదాతో మనిషికి గుర్తింపు రావచ్చు,కానీ కాలపాలనతోనే అతని నిబద్ధత బయటపడుతుంది!నీ విలువను ఇతరుల మాటలతో కొలవకు,నీ సమయాన్ని ఎలా ఉపయోగిస్తున్నావో ఒక్కసారి ఆలోచించు!

కాలానికి విలువనిస్తే నీ పనికి విలువ పెరుగుతుంది,నీ పనికి విలువ పెరిగితే నీ వ్యక్తిత్వం ఉన్నతమవుతుంది!

గుర్తుంచుకో మిత్రమా? కాలం ఎవరి కోసమూ ఆగదు,కాలాన్ని గౌరవించినవాడే జీవితంలో తన విలువను చాటుకుంటాడు!

రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.చరవాణి : 9866179385

## దుర్గా నవరాత్రి మండపాల్లో జంగం మధుకర్‌రెడ్డి ప్రత్యేక పూజలు



సైదాబాద్, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 14: దుర్గా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగం మధుకర్‌రెడ్డి సింగరేణి కాలనీ లో అమ్మవారి మండపాలను సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించి, హారతి సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు పొందారు.ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండపం కమిటీ సభ్యులు బోధసు కల్యాణ్, విజయ్‌తో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

# కోల్పోతానని భయపడే మనసు

నిన్ను కోల్పోతానని కలవరపడే వాడి కోసం పోరాడు,నీ దూరం తట్టుకోలేక తల్లడిల్లే వాడి కోసం నిలబడు.నీ మాట కోసం క్షణక్షణం ఎదురుచూసే వాడి కోసం నడువు,నీ మౌనం వెనుక బాధను చదివే వాడి కోసం కదులు.నీ నీడ దూరమైనా నీ జాడ వెతికే వాడి కోసం పోరాడు,నీ చూపు దూరమైనా నీ రూపం చూసే వాడి కోసం నిలబడు.నీ నవ్వు కోసం తన నవ్వునే మరిచే వాడి కోసం నడువు,నీ కన్నీటి కోసం తన కంటినీ తడిపే వాడి కోసం కదులు.నీ లేని లోటును ప్రతి రోజూ లెక్కించే వాడి కోసం పోరాడు,నీ రాక కోసం ప్రతి దారినీ చూసే వాడి కోసం నిలబడు.నీ మాటే తన మనసుకు మంత్రంగా మారిన వాడి కోసం నడువు,నీ ప్రేమే తన ప్రాణానికి అర్థమైన వాడి కోసం కదులు.నువ్వున్నా



ఒకటే, లేకున్నా ఒకటే అనుకునే వాడి కోసం కాదు,నీ ప్రేమ ఉన్నా లేనట్టే చూసే వాడి కోసం కాదు.నీ కన్నీరు కనిపించక నవ్వగలిగే వాడి కోసం కాదు,నీ గైర్హాజరీ గమనించని బంధం కోసం కాదు.నిన్ను విలువగా చూసే వాడి కోసం విలువగా నిలబడు,నిన్ను మనసుగా చూసే వాడి కోసం మనసుగా మిగులు.నీ కోసం పోరాడే వాడి కోసం ప్రాణంగా పోరాడు,నీ కోసం ఎదురుచూసే వాడి కోసం జీవితంగా ఎదురుచూడు.ప్రేమంటే మాట కాదు మనసును మార్చే మమకారం,బంధమంటే పేరు కాదు ప్రాణాన్ని కాపాడే అనుబంధం.కోల్పోతానని భయపడే వాడే నీ విలువ తెలిసిన వాడు,కోల్పోయినా పరవాలేదనుకునే వాడు నీ వాడు కాదు.రచన : ఆర్.కె.రెడ్డిగోగులపల్లి, నెల్లూరు జిల్లా.

# నాన్నా! నువ్వు లేని లోటు



నాన్నా? ఒక్కసారైనా మనసు పెట్టి ఆలోచించలేదా? నువ్వు లేని లోకంలో నీ బిడ్డలు ఎలా బతుకుతారని? నీ నీడలో పెరిగిన మమ్మల్ని ఒంటరిగావదిలి, ఏ గుండెతో నాన్నా? అనంతలోకాలకు వెళ్లిపోయావు? మమ్మల్ని కంటికి రెప్పలా కాపాడిన నీ చేతులు, ఇప్పుడు మా కన్నీళు తుడవడానికి లేవు నాన్నా!

మా కష్టం చూసి కరిగిపోయే నీ హృదయం, మా దుఃఖాన్ని చూడకుండానే మూగబోయిందా నాన్నా!

నువ్వున్నప్పుడు నీ విలువ మాకు పూర్తిగా తెలియలేదు, నువ్వు లేని ఈ రోజే నీ ప్రేమ విలువను నేర్పింది!

ఇంటి గోడలన్నీ అలాగే ఉన్నాయి, మనుషులూ అలాగే ఉన్నారు, కానీ నువ్వు లేని ఆ ఇల్లు శ్మశాన నిశ్శబ్దమైంది!

మా భవిష్యత్తు కోసం నీ వర్తమానాన్ని బలిచేశావు, మా చిరునవ్వుల కోసం నీ కన్నీళ్లను దిగమింగావు!

నీ బాధలను గుండెలో పాతిపెట్టి నవ్విన నాన్నా, మా బాధలను చూడకుండానే ఎలా వెళ్లిపోయావు?

నువ్వు లేవన్న నిజం గుండెను నిలువునా చీలుస్తోంది, నీ జ్ఞాపకాల ప్రతి మలుపు కన్నీటి వరదై పారుతోంది!

లోకం ముందు ధైర్యంగా నిలబడుతున్నామంటే, నీ పెంపకం ఇచ్చిన బలమే మమ్మల్ని నిలబెడుతోంది!

మళ్లీ ఒక్కసారి నాన్నా అని పిలవాలని ఉంది, నీ ఒడిలో తలపెట్టి చిన్నపిల్లాడిలా ఏడవాలని ఉంది!

కాలం తిరిగి రాదని తెలుసు, కన్నీళ్లు నిన్ను తేలేవని తెలుసు, అయినా నిన్ను మరిచే శక్తి మా గుండెలకు లేదని తెలుసు!

నాన్నా? నువ్వు వెళ్లిపోయావు, కానీ నీ ప్రేమ పోలేదు, నీ శరీరం మట్టిలో కలిసినా నీ జ్ఞాపకం మాలో చావలేదు!

మా జీవితపు చివరి శ్వాస వరకు ఒక్కటే మా ఆవేదన, మమ్మల్ని ఇంతగా ప్రేమించిన నువ్వే మాకు దూరమవ్వడం!

రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.చరవాణి : 9866179385

# ఆర్టీఐ దరఖాస్తులకు సమాధానాలు ఏవీ?

**అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు తప్పని వ్యయప్రయాసలు!**

**చట్టం ప్రకారం సమాచారం ఇవ్వాల్సిన పీఐఓలు బాధ్యతగా వ్యవహరించకపోతే సమాచార హక్కు చట్టం లక్ష్యం నెరవేరేదెలా?**




హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 14:ప్రజలకు ప్రభుత్వ పాలనలో పారదర్శకతను కల్పించి, అధికార యంత్రాంగాన్ని జవాబుదారీగా నిలబెట్టేందుకు రూపొందించిన సమాచార హక్కు చట్టం?2005 అమలులో అధికారుల బాధ్యతాయుతమైన వ్యవహారశైలి కీలకం. అయితే, సమాచారం కోసం పౌరులు దరఖాస్తులు సమర్పించినప్పటికీ, నిర్ణీత గడువులో సమాధానాలు అందకపోవడం, అసంపూర్ణ సమాచారం ఇవ్వడం లేదా చట్టబద్ధమైన కారణాలు లేకుండా సమాచారాన్ని నిరాకరించడం వంటి పరిస్థితులు అనేక ప్రశ్నలకు తావిస్తున్నాయి.చట్టం ఉంది.. గడువులు ఉన్నాయి.. మరి సమాచారం ఎందుకు అందడం లేదు?సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 7(1) ప్రకారం, సాధారణంగా ఆర్టీఐ దరఖాస్తుకు 30 రోజుల్లో సమాధానం ఇవ్వాలి. జీవితం లేదా వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన సమాచారమైతే 48 గంటల్లో అందించాలి. చట్టంలో పేర్కొన్న ప్రత్యేక సందర్భాల్లో వేర్వేరు గడువులు వర్తిస్తాయి.అయినప్పటికీ, దరఖాస్తుదారులకు సకాలంలో సమాచారం అందకపోతే వారు సంబంధిత అధికారులను సంప్రదించడం, మరోసారి లేఖలు రాయడం, మొదటి అప్పీల్ దాఖలు చేయడం వంటి చర్యలు చేపట్టాల్సి వస్తోంది. దీంతో సమాచారం పొందడానికి వెచ్చించాల్సిన సమయం, శ్రమ పెరుగుతున్నాయి.ప్రజలు సమాచారం అడగడం తప్పు కాదు. చట్టం నిర్దేశించిన బాధ్యతలను నిర్వర్తించడం ప్రభుత్వ అధికారుల విధి.సమాచారం కోసం పౌరులు కార్యాలయాల చుట్టూ తిరగాలా?సమాచారం పొందేందుకు దరఖాస్తు చేసిన పౌరుడు మళ్లీ మళ్లీ కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడితే, అది పరిపాలనా వ్యవస్థ పనితీరుపై ప్రశ్నలను లేవనెత్తుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, ప్రజా ప్రయోజనాల కోసం పనిచేసే సమాచార హక్కు కార్యకర్తలు ప్రయాణ ఖర్చులు, పోస్టల్ ఖర్చులు, పత్రాల సేకరణతో పాటు సమయ నష్టాన్ని కూడా భరించాల్సి వస్తోంది.ప్రజలకు సమాచారం అందించాల్సిన వ్యవస్థలోని లోపాల కారణంగా సమాచారాన్ని కోరిన వ్యక్తే అదనపు భారాన్ని మోయాల్సి రావడం ఆందోళనకరం.పీఐఓలు బాధ్యతను గుర్తించాలిప్రజా సమాచార అధికారులు ప్రతి దరఖాస్తును చట్ట ప్రకారం పరిశీలించి, అందించదగిన సమాచారాన్ని నిర్ణీత గడువులో అందించాలి. సమాచారాన్ని నిరాకరించాల్సిన సందర్భాల్లో సంబంధిత చట్ట నిబంధనలను ఆధారంగా చేసుకుని నిర్ణయం తీసుకోవాలి. మౌనంగా ఉండటం లేదా కారణం లేకుండా జాప్యం చేయడం ప్రజల్లో ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తుంది.అదేవిధంగా, శాఖల ఉన్నతాధికారులు తమ పరిధిలోని పీఐఓల పనితీరును సమీక్షించి, గడువు దాటిన దరఖాస్తుల వివరాలను పరిశీలించాలి. అవసరమైన శిక్షణ, మార్గదర్శకాలు అందించి, చట్టబద్ధమైన బాధ్యతల అమలును పర్యవేక్షించాలి.సమాచార హక్కు చట్టం ప్రజలకు కల్పించిన హక్కు కేవలం కాగితాలకే పరిమితం కాకూడదు. ప్రజలు అడిగిన సమాచారానికి చట్టబద్ధంగా, సకాలంలో సమాధానం అందేలా అధికార యంత్రాంగం పనిచేయాలి.సమాచారం కోసం ప్రజలు అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి కాకుండా, ప్రజల హక్కులను గౌరవిస్తూ అధికారులు బాధ్యతగా వ్యవహరించే పరిపాలనా సంస్కృతి రావాలి.

# బుద్ధారంలో పోలీసుల కమ్యూనిటీ కాంట్రాక్ట్ కార్యక్రమం

**గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.**

**నిఘా కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి**

**సీ,ఐ ఎల్ రవీందర్ యాదవ్**



గార్ల ఆరోగ్యాన్ని నాశనం చేసే, బతుకులను చిద్రవదం చేసే, గంజాయి వంటి మత్తు పదార్థాలకు ప్రజలు, యువత దూరంగా ఉండాలని గార్ల.. బయ్యారం సీ,ఐ ఎల్ రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం గార్ల.. బయ్యారం సీ,ఐ ఎల్ రవీందర్ యాదవ్, ఎస్సై ప్రశాంత్, గార్ల ఎస్సై బి సాయికుమార్ సిబ్బందితో కలిసి మండల పరిధి బుద్ధారం గ్రామంలో తనిఖీ చేపట్టారు. 20 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకోగా, సరైన ధ్రువీకరణ పత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని 32 వాహనాలు (బైకులు ఆటోలు) గుర్తించారు, 300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. తదుపరి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాట్సాప్ ద్వారా వచ్చే అవసరమైన లింకులను ఓపెన్ చేయకూడదని, అపరిచిత ఫోన్ కాల్స్ ను పక్కకు పెట్టాలన్నారు, సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 కి కాల్ చేయాలన్నారు. గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి నివాసం, దుకాణాల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామాలలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు, యువత పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.అవగాహన కార్యక్రమంలో బుద్ధారం గ్రామ ప్రజలు యువకులు పాల్గొన్నారు.

# శుభ్రత... ఆరోగ్యానికి భద్రత

**పారిశుధ్యం పై అవగాహన కల్పించిన డాక్టర్ హనుమంతరావు**



గార్ల )నివసించే ఆవాస నివాస ప్రాంతాలలో పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని ప్రభుత్వ డాక్టర్ వై హనుమంతరావు సూచించారు. బుధవారం ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య ఆరోగ్య సిబ్బంది, డాక్టర్ హనుమంతరావు నేతృత్వంలో మూల్కనూరు గ్రామంలో డ్రై డే కార్యక్రమాన్ని శ్రేణులతో కలిసి ఆయన నిర్వహించారు. పారిశుధ్యం పై ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలని, వాడిన నీటిని అంతరాయం లేకుండా సాఫీగా పోయేటట్లు చూసుకోవాలన్నారు. అపరిశుభ్రత వాతావరణం ఆవాస నివాస ప్రాంతాలలో నెలకొన్నట్లయితే మలేరియా డెంగ్యూ వంటి విష జ్వరాలు వ్యాప్తి చెందుతాయని ఆయన పేర్కొన్నారు. ముల్కనూరు పిహెచ్సి పరిధిలోగల ప్రజలు వ్యాధి బారిన పడిన సూచనలు కనిపించినప్పుడు వెంటనే స్థానిక ముల్కనూరు పిహెచ్సి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల చేత చూపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ప్రమీల ఆశా కార్యకర్తలు రమాదేవి అరుణ హైమావతి రత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పంటలలో..మిత్ర పురుగులు...

# శత్రు కీటకాలపై అవగాహన

**పురుగు మందులను విచక్షణ రహితంగా వాడొద్దు**

**సస్యరక్షణ అధికారి ఉదయ్ శంకర్**




గార్ల మండల పరిధి మద్దివంచ గ్రామంలో హైదరాబాద్ అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి ఉదయ్ శంకర్ ఆధ్వర్యంలో రైతు పొలంబడిలో భాగంగా మిత్ర పురుగులు.. శత్రు కీటకాలపై కర్షకులకు అవగాహన కల్పించారు. బుధవారం మండల పరిధి మద్ది వంచ గ్రామం జి పి లో కేంద్రీయ సమగ్ర సస్య రక్షణ కేంద్రం రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి విచ్చేసిన అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి ఉదయ్ శంకర్ నేతృత్వంలో రైతులకు పంట పొలాలలో మిత్ర పురుగులు శత్రు పురుగులపై అవగాహన కల్పించారు. విచక్షణ రహితంగా పురుగుమందులను వాడడం ద్వారా కలిగే నష్టాలను ఆయన కర్షకులకు వివరించారు. అన్నదాతలకు ట్రైకోడెర్మా విరిడి జీవ శిలీంద్ర నాశిని వినియోగాన్ని, ఎలా వాడాలో వివరించారు సిఐపి ఎం సి హైదరాబాద్ వారు తయారుచేసిన ట్రైకోడెర్మా విరిడి పౌడర్ ను రైతులకు ఈ సందర్భంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సస్యరక్షణ అధికారి బసవన్నప్ప విచ్చేసి రైతులను సమస్యలను అడిగి తెలుసుకుని అవసరమేరకు సలహాలు సూచనలు ఇచ్చారు. అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రైతులు పొలంబడి కార్యక్రమా న్ని అభినందించారు. ఈ అవగా హన కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి మేఘన ఉపసర్పంచ్ గ్రామపం చాయతీ కార్యదర్శి పెద్దలు గ్రామ రైతులు పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి ..**

## కరెంటు కోతలపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు సీఎం తీవ్ర హెచ్చరిక

రాబోయే సంక్షోభాన్ని ముందుగానే అంచనా వేసి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయలన్నారు.

తాగునీటికి, పశుగ్రాసానికి ఇబ్బందులు తలెత్తవద్దు

వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి సరఫరా సజావుగా సాగేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిర్మాణ రంగంతో పాటు ఇతర అవసరాలకు.. మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో (ఎస్టీపీలు) శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో పశువులు ఇబ్బంది పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ప్రతి మండలానికి గ్రూప్–1, గ్రూప్–2 స్థాయి అధికారులను నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆయా మండలాల్లో వర్షాభావ పరిస్థితులు, విద్యుత్, తాగునీటి సరఫరా, పంటలు, పశుగ్రాసం వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించే బాధ్యతలను వారికి అప్పగించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదించేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

గ్రామసభలు, కళాజాతలతో ప్రజల్లో అవగాహన కళాజాతల ద్వారా ప్రజలకు ఎల్‌నినో ప్రభావాన్ని వివరించాలని, నీరు, విద్యుత్ పొదుపుతో పాటు రాబోయే పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సీఎం ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అన్ని వర్గాల ప్రజలకు ఈ విపత్తు తీవ్రతను వివరించాలని, దసరా నుంచి దీపావళి వరకు రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సీఎం ఆదేశించారు.

## దివ్యాంగుల ముఖంలో

# చిరునవ్వే లక్ష్యం...

**:సేవా సంకల్ప్ అభియన్ లో అన్నదానం.**

**:బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలతరెడ్డి**



కోదాడ, అక్టోబర్ 14:కోదాడ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా కోదాడ పట్టణంలోని శనగల రాధాకృష్ణ ట్రస్ట్‌లో మానసిక దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సూర్యాపేట జిల్లా బీజేపీ దివ్యాంగుల సెల్ జిల్లా కన్వీనర్ ఏమిరెడ్డి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలతరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చల్ల శ్రీలతరెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా, సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి మేలు చేసేలా జరుపుకోవడం అభినందనీయమన్నారు. సమాజంలోని దివ్యాంగులు, నిరుపేదలు, వెనుకబడిన వర్గాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. దివ్యాంగులకు ఆప్యాయత, ఆదరణ అందించడంతో పాటు వారి ఆత్మగౌరవాన్ని కాపాడాలని, సమాజంలో సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సేవాభావంతో సమాజంలోని ప్రతి ఒక్కరినీ తమ కుటుంబ సభ్యులుగా భావించి పనిచేయడమే సేవా సంకల్ప్ అభియాన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పేదలకు సహాయం చేయడం, అవసరమైన వారికి అండగా నిలవడం ద్వారా సమాజంలో సేవాభావాన్ని పెంపొందించవచ్చని అన్నారు. మానసిక దివ్యాంగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన ఏమిరెడ్డి శంకర్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, దివ్యాంగుల సెల్ జోనల్ ఇన్‌చార్జి గోలి ప్రభాకర్, జిల్లా కోశాధికారి తాళ్ల నరేందర్ రెడ్డి, జిల్లా ప్రవాసి సెల్ కన్వీనర్ జల్లా జనార్దన్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పరశురామ్, బీజేపీ నాయకుడు సత్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో

# ఘనంగా శరన్నవరాత్రి పూజలు

**కుంకుమార్చన, లలితా సహస్రనామ**



చౌటుప్పల్, అక్టోబర్ 14 శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు చండీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చౌటుప్పల్ మండల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం, అష్టోత్తర శతనామావళి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చౌటుప్పల్ మండల శాఖ అధ్యక్షురాలు వెన్‌రెడ్డి సంధ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఉజ్జీనీ మంజుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ ధర్మకర్తల మండలి చైర్మన్ బొబ్బిళ్ల మురళి గురుస్వామి, వర్కల రవి గౌడ్, ఆవుల యేసు యాదవ్, గుగులోతు అరుణ, పెద్ది స్వాతి, కిషోర్ శర్మ, చింతల కరుణ తదితరులు పాల్గొన్నారు. అలాగే గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సభ్యులు పోలోజు శ్రీలత, ముటుకులోజు నీరజ, వనం మమత, సు రోజ్, శోభారాణి, జూకంటి రేవతి, నిమ్మల అండాలు, మామిడి వెంకటమ్మ తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రతి మహిళా భక్తురాలు పాల్గొనాలిఈ సందర్భంగా గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. చౌటుప్పల్ పట్టణంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని ప్రతి మహిళా భక్తురాలు ఈ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు. దుర్గాదేవి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు.

## విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి..

# లేకుంటే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదు

**వెలిమినేడు సబ్‌స్టేషన్ వద్ద మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో రైతు ధర్నా**




చిట్యాల అక్టోబర్ 14 రైతులకు నాణ్యమైన 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ చిట్యాల మండలం వెలిమినేడు సబ్‌స్టేషన్ వద్ద మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు గతంలో ఉన్న పరిస్థితులను మళ్లీ తీసుకొస్తామని చెప్పారని, ప్రస్తుతం రైతులకు విద్యుత్, సాగునీరు సక్రమంగా అందించలేని పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. రాష్ట్రంలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వంటి విద్యుత్ ఉత్పత్తి వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో ప్రభుత్వం ఎందుకు విఫలమవుతోందని ప్రశ్నించారు. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడటంతో రైతుల మోటార్లు, స్టార్టర్లు కాలిపోతున్నాయని, దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.కేసీఆర్ హయాంలో రైతులకు నాణ్యమైన విద్యుత్ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడంతోపాటు వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిస్తూ రైతును రాజుగా చేయాలనే లక్ష్యంతో పాలన సాగించారని చిరుమర్తి లింగయ్య గుర్తుచేశారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలతో కేసీఆర్ పాలనను గుర్తుచేసుకుంటున్నారని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. రైతుల కష్టాలను గుర్తించి తక్షణమే విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం చేయాలి ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తన నిర్లక్ష్య వైఖరిని విడనాడి రైతులకు సరిపడా నాణ్యమైన 24 గంటల విద్యుత్‌తోపాటు సాగునీరు అందించాలని చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో రైతుల ఆగ్రహానికి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# డంపింగ్ యార్డ్ దుర్వాసన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

**రాత్రివేళ వ్యర్థాలు డంపింగ్ చేసే వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి**



ఎల్బీనగర్,జ్యోతి ప్రభంజనం,ప్రతినిధి, అక్టోబర్ 14: మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని డంపింగ్ యార్డ్ వల్ల పరిసర కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న దుర్వాసన, కాలుష్య సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహాతోతో కలిసి డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల్లో పర్యటించి, స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్ నుంచి ప్రతిరోజూ తీవ్ర దుర్వాసన వెలువడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రక్తం, కొవ్వు పదార్థాలు, మురుగునీరు, ఇతర వ్యర్థాల కారణంగా పరిసర ప్రాంతాలు కలుషితమవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా వర్షాలు కురిసినప్పుడు దుర్వాసన మరింత తీవ్రమవుతోందని, వృద్ధులు శ్వాస సంబంధిత సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రివేళల్లో వ్యర్థాలను రోడ్లపైనే పడేస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని దుర్వాసనను అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో రూ.6 కోట్లతో స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టినట్లు గుర్తుచేశారు. వివిధ ప్రాంతాల నుంచి ట్యాంకర్ల ద్వారా వ్యర్థ రసాయనాలను తీసుకొచ్చి డంపింగ్ యార్డ్‌లో వదులుతున్నట్లు తన దృష్టికి రావడంతో అప్పటి అధికారులతో మాట్లాడి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించామని తెలిపారు. చెత్తను అక్రమంగా తరలించి వేస్తున్న లారీలను గుర్తించి భారీ జరిమానాలు విధించినట్లు పేర్కొన్నారు. గతంలో హైడ్రా, జీహెచ్‌ఎంసీ, అటవీ శాఖ, హైలా తదితర సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి అక్కడ నిల్వ ఉన్న మురుగునీటిని తొలగించేందుకు ట్యాంకర్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. జంతు కళేబరాలు, ఇతర వ్యర్థాలను పడేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకున్నామని తెలిపారు. దుర్వాసనను నియంత్రించేందుకు మోటార్ల సహాయంతో నిల్వ ఉన్న మురుగునీటిని తరలించే చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఆటోనగర్ పారిశ్రామిక ప్రాంతంలోని రసాయనాలు, ఎరువుల గోదాములు, మెకానికల్ షెడ్లను తనిఖీ చేసి, డ్రైనేజీ మార్గాల ద్వారా వ్యర్థాలు, రసాయనాలను విడుదల చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. డంపింగ్ యార్డ్ వద్ద గతంలో వాచ్‌మన్‌ను నియమించడంతో పాటు ఎస్టీపీ ప్లాంట్ల నిర్మాణం కూడా చేపట్టామని, ఇప్పటివరకు దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. డంపింగ్ యార్డ్ పరిసరాల్లో వ్యర్థాలు పడేయకుండా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే జోనల్ కమిషనర్‌ను కోరారు. ముఖ్యంగా రాత్రివేళల్లో వ్యర్థాలను తరలించే వాహనాలను గుర్తించి, నిబంధనల ప్రకారం వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానాలు విధించాలని సూచించారు. జోనల్ కమిషనర్ వికాస్ మహాతో స్పందిస్తూ ఎమ్మెల్యే సూచించిన అంశాలను పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. రాత్రివేళల్లో వచ్చే వాహనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని, రహదారుల పక్కన వ్యర్థాలను పడేయకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విఠల్‌రెడ్డి, టంగుటూరి నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి, సంతోష్ గుప్తా, రవి, బాలరాజుతో పాటు డంపింగ్ యార్డ్ ప్రభావిత కాలనీల అధ్యక్షులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# లాభాలకు కాంగ్రెస్ ప్రభుత్వం కోత

- వాస్తవ లాభాలు దాచిపెట్టి కార్మికులకు అన్యాయం
- రూ.59 వేల కోట్ల బకాయిలు చెల్లించకుంటే బొగ్గు సరఫరా నిలిపివేత దిశగా ఉద్యమం
- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ హెచ్చరిక




భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):సింగరేణి కార్మికుల కష్టార్జితానికి న్యాయమైన వాటా కల్పించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవ లాభాలను ప్రకటించకుండా కార్మికులకు అన్యాయం చేస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కార్మికుల శ్రమతో వేల కోట్ల ఆదాయం ఆర్జిస్తున్న సంస్థలో, లాభాల వాటాను గత ఏడాది ఇచ్చిన 34 శాతానికే పరిమితం చేయడం కార్మికుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ప్రశ్నిస్తోందని విమర్శించారు. బుధవారం కొత్తగూడెం శేషగిరి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2025?26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాస్తవ లాభాలను వెల్లడించకుండా కేవలం రూ.1,754 కోట్ల లాభాలనే ప్రకటించడం అనేక అనుమానాలకు తావిస్తోందని వారు పేర్కొన్నారు. గత ఏడాది ఇచ్చిన 34 శాతం లాభాల వాటానే ఈ ఏడాది కూడా కొనసాగించడం ద్వారా కార్మికులకు అదనంగా ఒక్క శాతం కూడా పెంచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల చెమటోడ్చి సాధించిన లాభాల్లో న్యాయమైన వాటా ఇవ్వాల్సింది పోయి లాభాల లెక్కలనే ప్రశ్నార్థకం చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. లాభాల వాటా నిర్ణయించే ముందు గుర్తింపు సంఘంతో చర్చించాల్సిన బాధ్యత యాజమాన్యానికి ప్రభుత్వానికి లేదా..? అని ఏఐటీయూసీ నాయకులు ప్రశ్నించారు. గుర్తింపు సంఘాన్ని సమావేశానికి పిలిస్తే వాస్తవ లాభాలపై ప్రశ్నలు ఎదురవుతాయని కార్మికులకు వాటా శాతం పెంచాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే సంప్రదింపులకు దూరంగా పెట్టారని ఆరోపించారు. సింగరేణి ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యేలను పక్కనపెట్టి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలతో మాత్రమే చర్చించి లాభాల వాటాను ప్రకటించడం కార్మికుల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చినట్లుగా ఉందన్నారు. సింగరేణి సంస్థకు జెన్‌కో, ట్రాన్స్‌కో నుంచి సుమారు రూ.59 వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నప్పటికీ వాటిని వసూలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు ధ్వజమెత్తారు. ఒకవైపు సింగరేణి కార్మికులకు లాభాల వాటా పెంచకుండా కోత విధిస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు సంస్థకు రావాల్సిన భారీ బకాయిలపై మాత్రం ప్రభుత్వం స్పందించడం లేదని సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బకాయిల వసూళ్ల కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విద్యుత్ సౌధ ముట్టడి చేపట్టామని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కను, ఆయన ప్రిన్సిపల్ సెక్రటరీని పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేసినా స్పందన రాలేదన్నారు. ప్రభుత్వం ఇకనైనా మేల్కొని సింగరేణికి రావాల్సిన రూ.59 వేల కోట్లను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించకపోతే పోరాటం మరింత ఉధృతం చేస్తాం. అవసరమైతే జెన్‌కో, ట్రాన్స్‌కోకు బొగ్గు సరఫరా నిలిపివేసే దిశగా ఉద్యమాన్ని తీసుకెళ్తాం అని వారు హెచ్చరించారు. సమ్మె నోటీసులో పేర్కొన్న 24 డిమాండ్లపై ఒప్పందం కుదిరినా వాటి పరిష్కారంలో ఒక్కో డిమాండ్‌ను పరిష్కరిస్తూ మిగిలిన సమస్యలను కూడా త్వరగా పరిష్కరిస్తామని యాజమాన్యం తెలిపిందని అన్నారు. ఒప్పందంలోని అన్ని డిమాండ్లను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని కోరారు. సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని తగ్గించి కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. అలాగే సింగరేణి ప్రాంతాల్లోనే సీఎస్‌ఆర్ నిధులను వినియోగించి స్థానిక ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్మికుల శ్రమతో సంస్థ లాభాలు ఆర్జిస్తూ అదే కార్మికులకు న్యాయమైన వాటా ఇవ్వడంలో వెనుకడుగు వేయడం అన్యాయమని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. సింగరేణి సంస్థకు రావాల్సిన బకాయిల వసూలు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మికులను చైతన్యపరిచి ఐక్య ఉద్యమాన్ని నిర్మిస్తామని స్పష్టం చేశారు. కార్మికుల హక్కులను విస్మరిస్తే చూస్తూ ఊరుకోబోమని సింగరేణి ప్రయోజనాల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ హెచ్చరించారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శులు ఎస్.వి.రమణమూర్తి, జక్కుల గట్టయ్య, ఉపాధ్యక్షులు క్రిస్టోఫర్, ఆఫీస్ బ్యారర్స్ సందబోయిన శ్రీనివాస్, నాగయ్య, పిట్ కార్యదర్శిలు నరేష్, కమల్, నాయకులు బండారి మల్లయ్య, మండల రాజేశ్వరరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లోని చైతన్యపురి, దిల్‌సుఖ్‌నగర్‌లో పీఎంజే జ్యువెలర్స్ కొత్త స్టోర్ ప్రారంభం




ఎల్ బీ నగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, అక్టోబర్ 14:అట్టహాసంగా ప్రారంభమైన ఈ కొత్త స్టోర్‌తో హైదరాబాద్‌లో బ్రాండ్ మరింత బలపడింది. దీంతో కలిపి నాలుగు రాష్ట్రాల్లోని పీఎంజే రీటైల్ నెట్‌వర్క్ స్టోర్ల సంఖ్య 47కి చేరింది. హైదరాబాద్, అక్టోబర్ 14, 2026: అద్భుతమైన హస్తకళా నైపుణ్యానికి, కాలాతీత అందాలకు ప్రసిద్ధి చెందిన దక్షిణ భారతదేశ ప్రజలకు అత్యంత ఇష్టమైన ఫైన్ జ్యువెలరీ బ్రాండ్ అయిన పీఎంజే జ్యువెలర్స్, హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురిలో కొత్త స్టోర్‌ను ఘనంగా ప్రారంభించినట్లు ఇవాళ ప్రకటించింది. పీఎంజే జ్యువెలర్స్ తెలంగాణ క్లస్టర్ హెడ్ దీపక్, చైతన్యపురి స్టోర్ మేనేజర్ మధన్ కుమార్ మరియు పీఎంజే జ్యువెలర్స్ కస్టమర్ల సమక్షంలో ఈ స్టోర్ ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవంతో పీఎంజే జ్యువెలర్స్ తన రిటైల్ ఉనికిని మరింత బలోపేతం చేసుకుంది. దీనితో భారతదేశంలోని నాలుగు రాష్ట్రాల్లో ఈ బ్రాండ్ స్టోర్ల సంఖ్య 47కి చేరింది. కొత్తగా డిజైన్ చేసిన ఈ స్టోర్, సాంప్రదాయ నైపుణ్యాన్ని ఆధునిక సౌందర్యంతో మిళితం చేసి, కస్టమర్లకు ఒక అద్భుతమైన ఆభరణాల కొనుగోలు అనుభవాన్ని అందిస్తోంది. ఇక్కడ హ్యాండ్‌క్రాఫ్టెడ్ జ్యువెలరీ భారీ కలెక్షన్ అందుబాటులో ఉంది. ఇందులో టెంపుల్ జ్యువెలరీ, యాంటిక్ గోల్డ్ నెక్లెస్‌లు, వడ్డాణాలు, బ్రైడల్ జ్యువెలరీ సెట్లు, హాఫ్-చీర మరియు అకేషన్-వేర్ ఆభరణాలు, డైమండ్ జ్యువెలరీతో పాటు రంగురంగుల రత్నాలతో తయారు చేసిన అలంకరణలు ఉన్నాయి. అంతేకాకుండా, కుందన్, పోల్కి, జడవు స్టైల్స్‌తో పాటు రోజువారీ ధరించే తేలికపాటి నెక్లెస్‌లు, ఇయర్‌రింగ్స్ మరియు రింగుల విస్తృత శ్రేణిని కూడా కస్టమర్‌లు పరిశీలించవచ్చు. ఈ కొత్త స్టోర్ ప్రారంభం గురించి పీఎంజే జ్యువెలర్స్ సీఈఓ కిరణ్ షిండే మాట్లాడుతూ, "చైతన్యపురిలోని మా కొత్త స్టోర్‌తో నాలుగు రాష్ట్రాల్లో పీఎంజే జ్యువెలర్స్ స్టోర్ల సంఖ్య 47కి చేరింది. గత 60 ఏళ్లుగా కాలాతీత హస్తకళా నైపుణ్యం కోసం కస్టమర్‌లు మాపై నమ్మకం ఉంచుతున్నారు. ఆ వారసత్వాన్ని మరియు వ్యక్తిగత షాపింగ్ అనుభవాన్ని దిల్‌సుఖ్‌నగర్ ప్రాంత కుటుంబాలకు మరింత దగ్గర చేయడం మాకు చాలా సంతోషంగా ఉంది. మా కొత్త స్టోర్ సాంప్రదాయ కళను, ఆధునిక డిజైన్‌ను ఏకం చేస్తూ.. నాణ్యత, పారదర్శకత మరియు తరతరాలుగా కస్టమర్‌లు మా బ్రాండ్‌పై ఉంచిన నమ్మకానికి అద్దం పడుతోంది" అని తెలిపారు. ఈ సందర్భంగా పీఎంజే జ్యువెలర్స్ తెలంగాణ క్లస్టర్ హెడ్ శ్రీ దీపక్ మాట్లాడుతూ, "మా చైతన్యపురి స్టోర్ గ్రాండ్ లాంచ్‌ను ప్రకటించడం మాకు చాలా సంతోషంగా ఉంది. ప్రతి క్షణం అందాన్ని ప్రతిబింబించే కాలాతీత ఆభరణాలను రూపొందించడానికే పీఎంజే జ్యువెలర్స్ ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తుంది. మా కొత్త స్టోర్ ద్వారా వినియోగదారులకు మరింత మెరుగైన షాపింగ్ అనుభవాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. అసాధారణమైన హస్తకళా నైపుణ్యం, సమకాలీన డిజైన్‌లు మరియు తరతరాలుగా మా బ్రాండ్‌పై కస్టమర్లు ఉంచిన నమ్మకాన్ని ఇది ఒకచోట చేర్చుతుంది" అని తెలిపారు. చైతన్యపురి స్టోర్ మేనేజర్ శ్రీ మధన్ కుమార్ మాట్లాడుతూ, "మా తాజా క్రియేషన్స్‌ను కొత్త స్టోర్‌లో ఆవిష్కరిస్తున్న తరుణంలో, పీఎంజే జ్యువెలర్స్ ప్రత్యేకతను చాటే అద్భుతమైన డిజైన్‌లను పరిశీలించాల్సిందిగా మా కస్టమర్లను ఆహ్వానిస్తున్నాము. ప్రతి ఆభరణం వెనుక ఒక ప్రత్యేకమైన కథ ఉంటుంది. వివాహాలు, కుటుంబ వేడుకల నుంచి ప్రతి చిన్న మైలురాయి వరకు మా కస్టమర్ల ప్రత్యేక క్షణాల్లో భాగం కావడం మాకు ఎంతో ఆనందంగా ఉంది" అని పేర్కొన్నారు. చైతన్యపురిలో పిఎంజే జ్యువెలర్స్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన కస్టమర్లు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆరు దశాబ్దాలకు పైగా ఉన్న ఈ బ్రాండ్ వారసత్వాన్ని, సాంప్రదాయ కళను కాపాడుతూ వస్తున్న నిబద్ధతను, కాలాతీత డిజైన్‌లను ఆధునిక సౌందర్యంతో తీర్చిదిద్దే ప్రతిభను వారు కొనియాడారు. నాణ్యత, నమ్మకం మరియు కస్టమర్లతో సార్థకమైన బంధాన్ని కొనసాగించడంలో పీఎంజే జ్యువెలర్స్ చూపుతున్న అంకిత భావాన్ని ఈ కొత్త స్టోర్ ప్రతిబింబిస్తోందని వారు పేర్కొన్నారు. 60 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన పీఎంజే జ్యువెలర్స్, అత్యుత్తమ లగ్జరీ ఫైన్ జ్యువెలరీ బ్రాండ్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. శాశ్వతమైన నాణ్యత, వ్యక్తిగత సేవలు మరియు ప్రత్యేకమైన ఆభరణాలు కోరుకునే కస్టమర్లకు నిపుణుల మార్గదర్శకత్వం అందించడంలో ఇది ప్రసిద్ధి చెందింది. ఈ బ్రాండ్ విస్తృత శ్రేణితో కూడిన డైమండ్ వెడ్డింగ్ జ్యువెలరీని అందిస్తోంది. తరతరాలుగా కుటుంబాల్లో ప్రత్యేక జ్ఞాపకాలుగా నిలిచిపోయేలా ప్రతి ఆభరణాన్ని ఎంతో సూక్ష్మంగా రూపొందిస్తారు. నాణ్యత మరియు కస్టమర్ల నమ్మకానికి కట్టుబడి ఉన్న పీఎంజే జ్యువెలర్స్, తమ స్టోర్లలో డైమండ్ టెస్టింగ్ మెషీన్లను (ఆఓబ) ఏర్పాటు చేయడం ద్వారా పారదర్శకతను మరింత పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల కస్టమర్లు డైమండ్ ఆభరణాలు కొనుగోలు చేసేటప్పుడు సరైన అవగాహనతో స్పష్టమైన నిర్ణయం తీసుకోవచ్చు. ప్రతి ఆభరణం అనుభవజ్ఞులైన కారిగర్ల (చేతివృత్తి నిపుణుల) నైపుణ్యాన్ని, అంకితభావాన్ని ప్రతిబింబిస్తుంది. ఇందులో సున్నితమైన హస్తకళా నైపుణ్యం, విశిష్టమైన డిజైన్ శైలి కలిసి ఉంటాయి. నాణ్యత, విలువ, హస్తకళా నైపుణ్యానికి సంబంధించి పీఎంజే భరోసా ప్రతి క్రియేషన్‌లోనూ కనిపిస్తుంది. సంప్రదాయాన్ని గౌరవిస్తూనే మారుతున్న కస్టమర్ల అభిరుచులకు తగినట్లుగా ఆభరణాలను రూపొందించాలన్న బ్రాండ్ నిబద్ధతను ఇది మరింత బలపరుస్తోంది. చైతన్యపురిలో ప్రారంభమైన ఈ కొత్త స్టోర్ పీఎంజే జ్యువెలర్స్ ప్రయాణంలో మరో మైలురాయిగా నిలిచింది. దీనిద్వారా ఈ బ్రాండ్‌కు చెందిన ప్రసిద్ధ కలెక్షన్లు, పర్సనలైజ్డ్ షాపింగ్ అనుభూతి దిల్‌సుఖ్‌నగర్ మరియు చుట్టుపక్కల ప్రాంతాల కస్టమర్లకు మరింత చేరువయ్యాయి.






printed and published by **Rapolu Lingaswamy**,onbehalf of printed at **SMILYS ONLINE** 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana **Editor: Rapolu Lingaswamy.pone:9908103501,** PRGI **NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com**